ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నామినేటెడ్ పదవుల్లో..

ఉమ్మడి విశాఖకు ప్రాధాన్యం



ప్రణవ్ గోపాల్



గండి బాబ్జి



సీతంరాజు సుధాకర్



పివిజి.కుమార్



ప్రగడ నాగేశ్వరరావు



శ్రావణ్ కుమార్



మళ్ల సురేంద్ర



దొన్ను దొర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రెండో విడత రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీలో ఉమ్మడి విశాఖకు ప్రాధాన్యత ఇచ్చింది. 59 మందితో కూడిన జాబితాను శనివారం ప్రకటించగా ఉమ్మడి విశాఖకు చెందిన వారే అందులో ఎనిమిది మంది ఉన్నారు. చైర్మన్ పదవులు దక్కడంతో

ఎనిమిది మందికి అవకాశం

వారిలోనూ, వారి అనుచర గణంలోనూ సంతోషం వ్యక్తమవుతోంది. పదవులు పొందిన వారిలో విశాఖ పట్నం తూర్పు నియోజక వర్గానికి చెందిన తెలుగుదేశం విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎంవి.ప్రణవ్ గోపాల్ ఉన్నారు. ఆయనకు కీలకమైన విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) చైర్మన్ పదవి దక్కింది. దక్షిణ నియోజక వర్గానికి చెందిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతం రాజు సుధాకర్‌కు ఎన్‌టిఆర్ వైద్య సేవ చైర్మన్ పదవి వచ్చింది. ఇక టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జికి ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అనకాపల్లి జిల్లాకు మిగతా 2లో..



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

సైన్స్ పట్ల అభిరుచిని పెంచడమే లక్ష్యం

- ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలి
- చెకుముకి రాష్ట్ర స్థాయి సంబరాలు ప్రారంభంలో డాక్టర్ గేయానంద్

వార్త మెయిన్‌లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు

వార్త మెయిన్‌లో..

సమస్యలపై ఉధృత పోరాటాలు

వార్త 4లో..

ఉక్కు కార్మికుల ఆకలి కేకలు పట్టవా..

వార్త 2లో..

అధిక శబ్దం చేసే సైలెన్సర్లు తుక్కుతుక్కు



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసాధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగరంలో అధిక శబ్దం చేసే, పొగను వెదజల్లే సైలెన్సర్లను పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. ఇటీవల కాలంలో యువత ఖరీదైన బైక్‌లకు కంపెనీ అమర్చిన సైలెన్సర్లను తీసివేసి, అధిక శబ్దం, పొగను వెదజల్లే సైలెన్సర్లను అమర్చి, మితిమీరిన శబ్ద, వాయు కాలుష్యానికి కారణం అవుతున్న వ్యవహారంపై పోలీస్ కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్, అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 181 సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆర్‌కె.బీచ్ వద్ద ఉన్న కాళీ మాత గుడి సమీపంలో శనివారం రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. అనంతరం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి సైలెన్సర్లను వాడడం భారత మోటార్ వాహన చట్టం-1988 ప్రకారం నేరమన్నారు. సెక్షన్ 190 ప్రకారం మూడు నెలల జైలు శిక్ష లేదా రూ.10 వేలు జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సును మూడు నెలల పాటు సస్పెండ్ చేయనున్నట్లు తెలిపారు. ఇదే నేరం రెండవసారి చేస్తే ఆరు నెలల జైలు శిక్ష, లేదా రూ.10 వేలు జరిమానా విధించడంతో పాటు మిగతా 2లో..

హైడ్రో పవర్ ప్లాంట్‌ను అడ్డుకోవాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - దేవరాపల్లి : గిరిజనులకు, ప్రజలకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్లాంట్‌ను ఐక్యంగా అడ్డుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. సిపిఎం దేవరాపల్లి మండల మహాసభ శనివారం షేక్ అప్పాసాహిబ్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ అదానీ కన్ను పడిన ప్రాంతమంతా నాశనమవుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రైవాడ, కోనాం ప్రాజెక్టులను, అటవీ ప్రాంతాన్ని దోచుకునే పనిలో అదానీ ఉన్నాడని, దీన్ని ప్రజలు గుర్తెరగాలని అన్నారు. ప్రధాని మోడీ అదానీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని తెలిపారు. అంబానీ, అదానీ మోడీకి రెండు కళ్లు వంటివారన్నారు. వారికి దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.



మాట్లాడుతున్న లోకనాథం

రైవాడ ప్రాజెక్టును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. దేవరాపల్లి హోల్ సేల్ కూరగాయల మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, అన్ని గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు వేయాలని, జీడి పిక్కలకు మద్దతు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉమ్మడి విశాఖకు ప్రాధాన్యం

చెందిన మాడుగుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పివిజి.కుమార్‌కు ఎపి కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లభించింది. అనకాపల్లికి చెందిన మళ్ల సురేంద్రకు ఎపి గవర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. అలాగే యలమంచిలి నియోజవర్గానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావుకు ఎపి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లభించింది. ఇక అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అరకు నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్‌కు ఎపి గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. దొన్నుదొరకు విజయనగరం ఆర్‌టిసి రీజనల్ బోర్డు ఛైర్మన్ పదవి లభించింది. పదవులు దక్కించుకున్న వారిలో ఒకరిద్దరు మినహా మిగిలిన అందరూ 2024 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయాలని భావించి, కూటమి పార్టీల మధ్య అవగాహన మేరకు పోటీ చేసే అవకాశం దక్కని వారే ఉన్నారు. తాజాగా వారిలో సంతోషం వ్యక్తమవుతోంది.

హైడ్రో పవర్ ప్లాంట్‌ను అడ్డుకోవాలి

ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. శారదా నదిపై బ్రిడ్జి, రెండు వైపులా ఎప్రోచ్ రోడ్ల పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అధిక ధరలను నియంత్రించాలని కోరుతూ ఈ నెల 14న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు.

దేవరాపల్లి మండల కార్యదర్శిగా బిటి.దొర



14 మందితో సిపిఎం దేవరాపల్లి మండల కమిటీ ఎన్నికైంది. మండల కార్యదర్శిగా బిటి.దొర, కమిటీ సభ్యులుగా ఎం.ఎర్రునాయుడు జె.ఈశ్వరరావు, సిహెచ్.లక్ష్మి, సిహెచ్.చినదేముడు, కాశీఈశ్వరరావు, డి.శంకర్ జె.పోతురాజు, వి.దొంగబాబు కె.సన్యాసినాయుడు షేక్ అప్పా సాహెబ్, ఇరట ఈశ్వరరావు. దుప్పి దాసు ఎన్నికయ్యారు. మండలాన్ని సమగ్రాభివృద్ధి చేయాలని మహాసభ డిమాండ్ చేసింది.

సైలెన్సర్లు తుక్కుతుక్కు

సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు నగరంలో హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపినందుకు 70,500 మంది ద్విచక్ర వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను మూడు నెలల పాటు సస్పెండ్ చేయమని రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారుడు, వెనుక కూర్చున్న వ్యక్తి తప్పనిసరిగా బిఐఎస్ మార్క్ హెల్మెట్ ధరించాలని స్పష్టంచేశారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా..? : వైసిపి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి, వైసిపి కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వ కార్యకర్తలు వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా పెడుతున్న అసభ్యకర, వ్యంగ్య పోస్టులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి వైసిపి నాయకులు తరలివచ్చారు. నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ అజితకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పిన రోజు నుంచి వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై అరెస్టులు మొదలయ్యాయన్నారు. పవన్ వ్యాఖ్యల పై నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కోసం అరెస్టులు చేస్తున్నారన్నారు. విశాఖ జిల్లాలో తమ పార్టీకి చెందిన ముగ్గురు సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారన్నారు. ప్రభుత్వ పెద్దలను సంతృప్తి పరచడం కోసం పదేపదే స్టేషన్లు చుట్టూ తమ పార్టీ కార్యకర్తలను తిప్పుతున్నారన్నారు. అత్యాచారాలు, హత్యలు చేసిన వారిపై పోలీసులు తమ ప్రతాపం చూపించాలన్నారు. పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతల పైశాచిక ఆనందంతో గీతాంజలి అనే మహిళ మరణించిందన్నారు. మహిళలకు అండగా ఉంటామని పవన్ కల్యాణ్ చెప్పారని, మరి గీతాంజలికి ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. తాము ఇచ్చిన కంప్లైంట్ పై కనీసం స్పాంపు వేయలేదని, పెట్టిన సంతకాన్ని కూడా కొట్టివేశారని తెలిపారు. టిడిపి కార్యకర్తల్లా పోలీసులు మారిపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల ఆకలి కేకలు పట్టవా..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించని ఉక్కు యాజమాన్యానికి కేంద్ర బిజెపి అండగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కార్మికులు చేసిన ఉక్కు ఉత్పత్తితో గడచిన 15 రోజుల్లో స్టీల్ అమ్మకం ద్వారా సుమారు రూ.650 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యాయి. ఇంతలా ఉక్కు ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు స్టీల్ మేనేజిమెంట్ జీతాల్లేకుండా ఆరు నెలలుగా కడుపులు మాడ్చేస్తున్నా 'కూటమి' పాలకులు ఏమయ్యారో ? ఎక్కడ దాక్కున్నారో ? ఎవ్వరికీ అర్థం కావడం లేదు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఒకవైపు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1367 రోజులుగా పోరాటాన్ని కొనసాగిస్తూనే ఇంతవరకూ ఏ రోజూ ఉత్పత్తిని ఆపలేదు. అయినప్పటికీ వారికి యాజమాన్యం జీతాలు సకాలంలో ఇవ్వడం లేదు.

పర్మినెంట్ ఉద్యోగులకు రెండు నెలలు దాటి, కాంట్రాక్టు కార్మికులకు 6 నెలలుగా యాజమాన్యం జీతాలివ్వకుండా తీవ్ర మానసిక ఆవేదనకు గురిచేస్తుండటం శోచనీయం. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణాలిస్తామని ఒకరు... అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపలేకపోతే పదవికి రాజీనామా చేస్తానని మరొక నాయకుడు ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకొని గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ వరకూ ఇవే చిలక పలుకులు పలుకుతూ గద్దెనెక్కారు. నేడు విశాఖ ఉక్కు కార్మికులంతా ప్రభుత్వం ఎక్కడుంది ? అంటూ ప్రశ్నించే పరిస్థితి నెలకొంది. ఈ నెల 10న కుటుంబాలతో సహా పాత గాజువాక జంక్షన్‌లో ధర్నాకు సిఐటియు ఇచ్చిన పిలుపునకు భారీ స్పందన లభించే అవకాశాలు



కనిపిస్తున్నాయి.

నిజంగా జీతాలివ్వలేని పరిస్థితి ఉందా ?

ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం చేతిలో ప్రస్తుతం రూ.950 కోట్లు ఉన్నాయి. కార్మికులకు మాత్రం జీతాలు చెల్లించడానికి రూ.80 కోట్లు వెచ్చించకపోవడం చూస్తే కావాలనే కడుపు మాడ్చి తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసే కుట్ర దీంట్లో దాగి వుందన్నది స్పష్టమవుతోంది. స్టీల్ ఉత్పత్తిని మార్కెట్‌లో సేల్ చేయడం ద్వారా 15 రోజుల క్రితం సుమారు రూ.650 కోట్లు బ్యాంకులో జమ అయ్యాయి. ఇది కాకుండా మరో రూ.300 కోట్లు వరకూ డ్రా (కరెంట్ అకౌంట్) నుంచి చేసేందుకు అవకాశం ఉంది. అర్ధాకలితో కార్మికులు ప్లాంట్‌లోకి వెళ్లి ఉత్పత్తి చేస్తూ ఉన్నా యాజమాన్యం మాత్రం జీతాలు చెల్లించకపోవడం వెనక కేంద్రంలోని బిజెపి హస్తం లేకుండా ఉంటుందా ? అన్నది చర్చ. రాష్ట్రంలోని కూటమి నేతలైన తెలుగుదేశం, జనసేన కార్మికులకు జీతాలివ్వని ఉక్కు యాజమాన్యాన్ని ప్రశ్నించకపోవడాన్ని చూస్తే వారు ఎటువైపు ఉన్నారో ఇట్టే అర్థమవుతుంది.

ఆగని కుట్రలు

జీతాలే కాదు.. ఉద్యోగులను తొలగించే కుట్రల నుంచి యాజమాన్యం వెనక్కి వెళ్లలేదు. మరోవైపు రా మెటీరియల్‌కు కేంద్రం అనుమతించడం లేదు. విశాఖ ఉక్కును ఇన్ని విధాలా దిగ్బంధనం చేస్తే ఎవరు రక్షిస్తారు ? అన్న ప్రశ్న ఈ ప్రాంత ప్రజానీకంలో రేగుతోంది. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో ముందుకెళ్లడానికి కూటమి నుంచి ఇసుమంతైనా సహకారం లేదు. ఈ విషయమై ఉక్కు కార్మికవర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది.

యుపిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగులకు..

మినిమం టైం స్కేల్ అమలుచేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : యుపిహెచ్‌సిలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం విశాఖ జిల్లా యుపిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగుల మహాసభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ, యుపిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్‌తో లింకు చేయవద్దని, రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం



ఎన్నికైన నూతన కమిటీ

విశాఖ జిల్లా యుపిహెచ్‌సి ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా పి.మణి, అధ్యక్షులుగా కెసిహెచ్ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.పవిత్ర, కార్యనిర్వాహక అధ్యక్షునిగా టి.మధు, కోశాధికారిగా జి.రమణబాబు ఎన్నికయ్యారు.

'భూమి దేవస్థానానిదే...'

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గుడిలోవలో సర్వే నెంబర్ 69లో ఉన్న 26 ఎకరాల 20 సెంట్లు భూమి శ్రీ రంగనాథ స్వామి దేవస్థానానికి చెందిందిగా హైకోర్టు తీర్పు వెల్లడించినట్లు దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ఎస్.నానాజీబాబు తెలిపారు. దేవస్థానానికి వ్యతిరేకంగా 15 సంవత్సరాల క్రిందట ఇద్దరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని, ఆ కేసులను హైకోర్టు కొట్టివేస్తూ భూమి దేవస్థానానికి చెందుతుందన్నట్లు తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు. ఈ కేసును వాదించిన ఎన్‌విఎస్ ప్రసాద్‌వర్మకు ఎస్.నానాజీబాబు అభినందనలు తెలిపారు.

వికలాంగునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి ఆర్‌హెచ్.కాలనీలో శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతున్న కుటుంబాలకు 6వ వార్డు మాజీ అధ్యక్షులు, సూర్య కనస్ట్రక్షన్ అధినేత వాండ్రాశి అప్పలనాయుడు శనివారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే.గురునాథ్, బీసీ సెల్ ప్రెసిడెంట్ రెడ్డి సత్యనారాయణ, కొప్పాక రామకృష్ణ, కొల్లి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మొక్కల వితరణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్మీ రిటైర్ట్ ఉద్యోగి తిరుపతిరావు మొక్కలను అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పనస, జామ తదితర మొక్కలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ పట్నాయక్‌కు అందించారు. సైన్స్ ఉపాధ్యాయులు ముత్యాలనాయుడు సమక్షంలో విద్యార్థులు పాఠశాల పరిసరాల్లో ఈ మొక్కలను నాటారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత భోజనం

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని జివిఎంసి అడిషనల్ కమిషనర్ -1 రేలంగి సోమన్నారాయణ దంపతులు శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 250 మంది అయ్యప్ప స్వాములకు సంక్రాంతి వరకు భోజన సౌకర్యం సమకూరుస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. శనివారం అన్నదాన కార్యక్రమానికి వానపల్లి అప్పారావు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో విరాళ దాతలు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ వేద పండితులు నగేష్ శర్మ, ప్రభాస్ పాల్గొన్నారు.



ప్రణవ్ గోపాల్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు సుధాకర్

ప్రణవ్‌గోపాల్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విఎంఆర్‌డిఎ ఛైర్మన్‌గా నియమితులైన ప్రణవ్‌గోపాల్‌ను 10వ వార్డు టిడిపి సీనియర్ నాయకులు బలగ సుధాకర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - అరిలోవ : విద్యార్థులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని గురుకుల పాఠశాల బోధకులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. విద్యార్థుల తప్పొప్పులను సరిదిద్ది వారిని మంచి మార్గంలో పయనింపజేయాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం అడవివరం, శ్రీ కృష్ణాపురం బిసి, ఎస్సీ గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థులు రాసిన నోటు పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు. తప్పులను సరిదిద్దాలని, మనసుతో పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంకితభావంతో బోధన చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. డ్రాయింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు అవార్డులు, ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ రూపవతి, కృష్ణాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఇతర బోధకులు, సిబ్బంది ఉన్నారు.

నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : ఎంచుకున్న రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారానే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అవంతి విద్యా సంస్థల ఛైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విశాఖ రీజియన్‌కు చెందిన పలు పారిశ్రామిక సంస్థల హెచ్‌ఆర్‌లతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక రంగాల్లో, సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతికతను అలవాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఫెనోమ్యూఫిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై దృష్టిపెట్టాలని సూచించారు. ఏడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, నర్సీపట్నం, గరివిడి అవంతి విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎసిపి లక్ష్మణరావును అభినందిస్తున్న శ్రీనివాసరావు

క్రైమ్ ఎసిపి లక్ష్మణరావుకు అభినందనలు

ప్రజాశక్తి - అరిలోవ : విశాఖ సిటీ క్రైమ్ ఎసిపి దాసరి లక్ష్మణరావును ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లోని శ్రీనివాస కార్ కేర్ అధినేత బోని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఎసిపి లక్ష్మణరావు గతంలో గోపాలపట్నం ఎస్ఐగా, ఫోర్త్ టౌన్, ద్వారకా జోన్ సిఐగా, విజయనగరం వన్ టౌన్ సిఐగా కర్నూల్, వైజాగ్ సిఐడిలో డిఎస్‌పిగా పనిచేశారు.

దంత సంరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : బాలల్లో నోటి ఆరోగ్య ప్రాధాన్యతను పెంపొందించడానికి ఈ నెల 14వ తేదీ వరకు గీతం దంత కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యాన దంత సంరక్షణ కోసం చేపట్టే 'శిశుగీతం' కార్యక్రమం పోస్టర్‌ను శనివారం గీతం దంత కళాశాల ఆసుపత్రి వైద్యులు ఆవిష్కరించారు. గీతం ఆసుపత్రి పీడియాట్రిక్స్, ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగం ఆధ్వర్యాన నగరంలోని పాఠశాలల విద్యార్థుల్లో నోటి ఆరోగ్య ప్రాధాన్యతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు గీతం దంతకళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ వివి.నరసింహారావు, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ సిఎస్.శ్రీనివాస్ తెలిపారు. బలహీనమైన దంతాలు, అపరిశుభ్రమైన నోరు కారణంగా రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు, క్యావిటీస్ వంటి సమస్యలు వస్తుంటాయని చెప్పారు. దంతాలు ఊడిపోవడం, వాటి అరమరిక విషయంలోనూ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని, వీటిపై పిల్లలకు అవగాహన అవసరమని, దీనిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీతం దంత కళాశాల సిబ్బంది

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టిడిపి యువ నేత గంటా రవితేజ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కె.బాలాజీ, పార్టీ మండల అధ్యక్షులు డిఎన్.రాజు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి -మధురవాడ : కార్తీకమాసం సందర్భంగా పంచారామాలకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్‌ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. మధురవాడ డిపోలో సిబ్బందికి మధురవాడ, విశాఖ నుంచి కండిషన్‌లో ఉన్న బస్సులు తిప్పేలా శనివారం పలు సూచనలు చేశారు. శబరిమల వెళ్లే స్వాములకు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ఈ సర్వీసులను డిపో మేనేజర్ పిబిఎంకె.రాజు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్ మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత టోల్ గేట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని బస్సు ఢీకొని ట్రాన్స్ జెండర్ మృతి చెందినట్లు సిఐ సన్నిబాబు తెలిపారు. నాతవరంకు చెందిన అంకురెడ్డి రాజబాబు (30) 7 సంవత్సరాల క్రితం ఇంటి నుండి బయటకు వచ్చి రాధిక గా పేరు మార్చుకుని ట్రాన్స్ జెండర్ గా తునిలో ఉంటుంది. తోటి ట్రాన్స్ జెండర్‌లతో కలిసి శుక్రవారం రాత్రి కాగిత టోల్ గేట్ వద్ద భిక్షాటన చేస్తుండగా గుర్తుతెలియని బస్సు ఢీకొనడంతో ట్రాన్స్ జెండర్ అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్ జెండర్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ వెల్లడించారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట గ్రామ శివారులో శనివారం 1.50 కేజీల గంజాయిని పట్టుకోవడం జరిగిందని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. ఏఎస్సై పూర్ణచంద్రరావుకు ముందుగా అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టి ముగ్గురిని తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో వీరి వద్ద ఈ గంజాయి లభ్యమైందన్నారు. ఈ మేరకు విజయవాడకు చెందిన పూసల అరవింద్, బండిగట్ల కృపరాజు, పార్వతీపురం జిల్లాకు చెందిన పొందూరు మురళీకృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మదుం కూలిపోయి రైతు దుర్మరణం

ప్రజాశక్తి-కె.కోటపాడు : పంట పొలాలకు నీరు విడిచిపెట్టేందుకు చెరువు మదుం తీస్తుండగా మదుం గోడ కూలిపోయి రైతు దుర్మరణం చెందిన సంఘటన కె.కోటపాడు పంచాయతీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని సింగన్నదొరపాలెం శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన రొంగలి కన్నబాబు (64) తన మిత్రుడు దోకల మోహన సన్యాసిరావుతో కలిసి శనివారం కె.కోటపాడు గ్రామంలోని పైడమ్మ చెరువు వద్దకు వెళ్లారు. చెరువు మదుముకు అడ్డంగా ఉన్న ఇసుక బస్తాలను తొలగిస్తుండగా, ఒక్కసారిగా మదుం గోడ కూలిపోయి కన్నబాబుపై పడింది. దీంతో కన్నబాబు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమీపంలో రైతులందరూ మదుం పగలగొట్టి మృతదేహాన్ని ఒడ్డికి తీశారు. మోహన సన్యాసిరావు కొద్దిపాటి గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. కన్నబాబు భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

ప్రజాశక్తి-కశింకోట : తీవ్ర అనారోగ్యం కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని చెరకాము గ్రామానికి చెందిన రెడ్డి బాబ్జి (29) అనే యువకుడు విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రెడ్డి బాబ్జి 15 సంవత్సరాల నుండి ఆస్తమా, బ్లడ్ ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నాడు. తీవ్ర అనారోగ్యం కారణంగా బాబ్జి డిప్రెషన్‌కు గురై మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఇంటి వద్ద పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాబ్జిని అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం బాబ్జి మృతి చెందాడు. మృతుని తండ్రి కన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన దాసరి ఆనంద్ (53) శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... దాసరి ఆనంద్ శనివారం గేదెలు మేపడానికి వెళ్లాడు. గేదెలకు నీరు కోసం ఏలేరు కాలువలో దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన గ్రామస్తులు బయటకు తీసి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. ఇప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆనంద్ భార్య దాసరి లక్ష్మి ఫిర్యాదు చేసిన మేరకు కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూర్మన్నపాలెంలో
నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -ఉక్కునగరం : కూర్మన్నపాలెంలోని 4 ఎస్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో కంటి పరీక్షలు, రక్త, థైరాయిడ్, బిఎండి టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. గైనకాలజీ, సుగర్, థైరాయిడ్, పిడియాట్రిక్, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ మురళీకృష్ణ కోరారు.

మాధవధారలో వైద్య, రక్తదాన శిబిరాలు

మాధవధార: సంఘ సేవకులు, కీర్తిశేషులు ససపల సూర్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా మాధవధార కళింగయూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి సౌజన్యంతో ఆదివారం మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి నంబాల ఈశ్వరరావు, తమ్మినేని వెంకటేష్ తెలిపారు. తెన్నేటినగర్ పార్కు వద్ద ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు శిబిరం ఉటుందని పేర్కొన్నారు. కళా హాస్పిటల్ బృందంతో రోగులకు వైద్య సేవలందించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పండ్ల దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

పండ్లతో ఆరోగ్యం

ప్రజాశక్తి -గాజువాక: పండ్లు ఆరోగ్యానికి మంచిదని భాస్కర్ విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ పి.రమాదేవి తెలిపారు. జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో పండ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.రమాదేవి మాట్లాడుతూ మనం తినే ఆహారంలో రోజూ కనీసం ఒక పండు ఉండేలా చూసుకోవాలని సూచించారు. 1, 2వ తరగతి విద్యార్థులు ఆపిల్, ఆరంజి, అరటిపండు, సీతాఫలం, మామిడి, బొప్పాయి, జామ, నారింజ తదితర పండ్ల ఆకృతులను వేసి వాటి గురించి వివరించారు. బాగా ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది స్వాతి, శిరీష, బాలమేరీ, సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రెసిడెన్షియల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రెసిడెన్షియల్ స్కూల్ 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ ఎంపి శ్రీభరత్ హాజరై 'స్పేస్ ల్యాబ్'ను ఆవిష్కరించారు. గౌరవ అతిథులుగా డిఆర్‌డిఒ మాజీ డైరెక్టర్ దేబాసిష్ చక్రవర్తి, టింపనీ స్కూల్ డైరెక్టర్ వందన ఆనంద్ అబ్రహం, ప్రత్యేక అతిథిగా క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ హాజరై ప్రెసిడెన్షియల్ స్కూల్ నవంబర్ మాసపత్రికను ఆవిష్కరించారు.

ఆరోగ్య రంగ కేటాయింపులు 6శాతానికి పెంచాలి

ప్రజాశక్తి-మాధవధార : రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి కేటాయింపులు జిడిపిలో రెండు శాతం కంటే తక్కువగా ఉన్నాయని, దీనిని ఆరు శాతానికి పెంచాలని పిసిపి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు డిమాండ్‌చేశారు. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు వైద్య ఖర్చుల భారం తగ్గించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మూల వెంకట్రావు లేఖ రాశారు. మెరుగైన ఆరోగ్యం వల్ల కార్మిక శక్తి విస్తరిస్తుందని, ఉత్పాదకతను పెంచడంతో ఆర్థికవృద్ధికి సహాయపడుతుందని వివరించారు. గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. విశాఖ విమ్స్‌ను నిమ్స్ స్థాయికి అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తక్షణమే ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు.

నేవీ ఉద్యోగాలకు విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల జరిగిన నేవీ (ఎస్ఎస్ఆర్) ఉద్యోగాలకు గాజువాకలోని విశాఖ డిఫెన్స్ అకాడమీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎం.తార్నా, స్నేహలత ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్లు బండి శ్రీనివాసరావు, డిఎస్ఎస్ కృష్ణారావు తెలిపారు. మొదటి బ్యాచ్‌లోనే ఎంపిక పట్ల ఆనందం వ్యక్తంచేశారు.

సమస్యలపై ఉద్ధృత పోరాటాలు

- ★ కార్పొరేట్ల ప్రయోజనాలే మోడీ, చంద్రబాబుకు ముఖ్యం
- ★ ప్రజలపై విపరీత భారాలు
- ★ సిపిఎం కంచరపాలెం జోన్ మహాసభలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉధృత పోరాటాలు నిర్వహించనున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. ధనవంతులు, కార్పొరేటర్ల ప్రయోజనాల కోసమే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తున్నాయని విమర్శించారు. ఈ క్రమంలోనే ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. శనివారం సిపిఎం కంచరపాలెం జోన్ 9వ మహాసభ బొట్టా నరసింగరావు భవనంలో జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు అరుణ్‌జీ పతాకావిష్కరణ చేశారు. తొలుత సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా నాయకులు ఆర్‌వి.రాజు, ఎ.పుష్పాంజలి సాహూ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఒ.అప్పారావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సభకు అధ్యక్షవర్గంగా ప్రకాష్‌రావు, సిహెచ్.కమల వ్యవహరించారు. సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారన్నారు. ప్రజల సొమ్మును కార్పొరేట్లు ఎలా దోచుకుంటున్నారో వివరించారు. అన్నింటినీ ప్రయివేటుపరం చేస్తున్నారన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కుట్రలు చేస్తున్నారని తెలిపారు. కార్మికుల జీతాలను పెంచకుండా యజమానులకు నేటి పాలకులు సేవ చేస్తున్నారని విమర్శించారు. కొత్త ప్రభుత్వాలలో ఉద్యోగాలు లేవని, కొత్త ఉద్యోగాలను కల్పించే కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడం లేదని అన్నారు. నిరంతరం అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దీన్ని గుర్తెరిగి ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, బి పద్మ తదితరులు పాల్గొన్నారు. తాటిచెట్లపాలెంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, దేవస్థానం భూ సమస్యను పరిష్కరించాలని, పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ మహాసభ డిమాండ్ చేసింది. కొండవాలు ప్రాంతాలకు రక్షణ సదుపాయాలు, రిటర్నింగ్ వాల్స్, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కంచరపాలెం హైవేలో ఫ్లై ఓవర్ నిర్మించాలని, జోన్‌లోని ఇతర సమస్యలను పరిష్కరించాలని మహాసభ డిమాండ్ చేసింది.



కంచరపాలెం జోన్ మహాసభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

జోన్ కార్యదర్శిగా బొట్టా ఈశ్వరమ్మ



సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శిగా మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ ఎన్నికయ్యారు. జోన్ కమిటీ సభ్యులుగా యుఎస్ఎన్.రాజు, ఒ.అప్పారావు, బి.సింహాచలం, ఎం.ఈశ్వరరావు, జి.రమణ, ఎస్.శ్రావణ్, జి.అప్పలరాజు, పి.గౌరీష్, టి.లక్ష్మీకాంతం, ఒ.విజయ, ఆర్ఎన్.మాధవి, కె.సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.

వర్క్స్ కమిటీ ఎన్నికల్లో ఎన్ఎడి సిఇ విజయకేతనం

ప్రజాశక్తి - కరాస: కార్మికుల కోసం అహర్నిశలు కషి చేస్తున్న ఎన్ఎడి సిఇ యూనియన్‌కు కార్మికులు వరుస విజయాలతో పట్టం కడుతున్నారని యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్ఎడి కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో విజయానందించడమే కాకుండా, వెరిఫికేషన్ ఎన్నికల్లో కూడా విజయాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. భీమునిపట్నంలో మొట్టమొదటిసారిగా జరిగిన ఎన్ఎడి వర్క్స్ కమిటీ ఎన్నికలలో ముగ్గురుకు ముగ్గురు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో కార్మికులు గెలిపించారని తెలిపారు. ఈ నెల 8వ తేదీన విశాఖపట్టంలో జరిగిన వర్క్స్ కమిటీ ఎన్నికల్లో 6 గురిని, క్యాంటీన్ కమిటీలో 2 కు 2 సీట్లను కార్మికులు గెలిపించారని వివరించారు. కార్మికులు ఇచ్చిన ఈ బాధ్యతలను స్వీకరించి కార్మిక హక్కుల కోసం పోరాడుతామని స్పష్టంచేశారు. ఈ ఎన్నికలలో వర్క్స్ కమిటీ నుంచి డి.వి.శ్రీనివాసు, వి.సంతోష్, పి.సత్యనారాయణ, టి.సంతోష్, శంభుకుమార్, జిన్ని నాయుడు, క్యాంటీన్ కమిటీ నుంచి పి.శివప్రసాద్, సోములు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ నూకరాజు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయోత్సవంలో పాల్గొన్న ఎన్ఎడి సిఇ యూనియన్ నేతలు, కార్మికులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ శివారు బర్డన్‌నగర్‌లో నివసిస్తున్న 120 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు సిపిఐ పెందుర్తి నియోజకవర్గ నాయకులు ఆర్ శ్రీనివాస్, వై.రాంబాబు ఆధ్వర్యాన కాలనీవాసులు వినతిపత్రం అందించారు. బర్డన్‌నగర్‌లో రేకుల షెడ్లు, తాటాకు ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నవారంతా భవన నిర్మాణ రంగ, ఇంటి పనులు చేసే కార్మికులని తెలిపారు. కొన్ని ఇళ్లకు సంబంధించి జివిఎంసికి ఇంటిపన్నులు కూడా చెల్లిస్తున్నారని వివరించారు. విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందని, అధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బర్డన్‌నగర్ వాసులు అరుణ, అనురాధ, జగదాంబ, దమయంతి, మిన్నరావు తదితరులు ఉన్నారు.

పంచకర్లకు ఆర్ఎంపిల వినతి

ప్రజాశక్తి- వేపగుంట : గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు జారీ చేసిన జీవో 465 కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆగిపోయిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారంలో ఉన్నందున ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చించాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతి ఇచ్చిన వారిలో సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, ఎం.కృష్ణ, సురంగి వెంకటరావు, కేతన మురళీకృష్ణ, స్థానిక నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94, 97 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం శంకుస్థాపన చేశారు. 97వ వార్డు పరిధి సుజాతనగర్, సెంట్రల్ బ్యాంక్ వద్ద బి.టి.రోడ్డు నిర్మాణం, గోపాలకృష్ణనగర్‌లో ఆర్‌సిసి బాక్స్ కల్వర్టు నిర్మాణం, చినముషిడివాడ సత్యనగర్, గణేష్‌నగర్‌లో క్రాస్ కల్వర్టు, ఎస్‌డబ్ల్యు డ్రైన్ నిర్మాణం, శ్రమశక్తినగర్‌లో శ్రీ భాస్కర్ హైట్స్ నుంచి ఎలక్ట్రికల్ ట్రాన్స్ ఫార్మర్ వరకు బి.టి.రోడ్డు , కిషోర్ లే-అవుట్, శ్రీ లక్ష్మి కమ్యునిటీ హాల్ వద్ద రెన్యువల్ బి.టి.రోడ్డు నిర్మాణాలకు సుమారు రూ.84 లక్షల అంచనా వ్యయంతో వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు.

94వ వార్డు పరిధి పురుషోత్తపురంలో ఇంటర్నల్ సిసి రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం, సేనాతివానిపాలెంలో శివాలయం నుంచి బి.ఆర్.టి.ఎస్ రోడ్డు వరకు ఎస్.డబ్ల్యు డ్రెయిన్, సిసి డ్రెయిన్ల నిర్మాణం, సేనాతివానిపాలెం, ఆంజనేయులు నగర్‌లో సిసి రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టు, జుల్లాలమ్మ గుడి వద్ద రిటైనింగ్ వాల్, కృష్ణనగర్‌లో ఎస్‌డబ్ల్యు డ్రెయిన్, అప్పల నర్సయ్య కాలనీలో ఇంటర్నల్ సిసి డ్రెయిన్లు, బీసీ కాలనీలో ఇంటర్నల్ సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు రూ.1.13 కోట్ల అంచనా వ్యయంతో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నాయకులు సేనాపతి సోమశేఖర్, పార్వతి, గంట్ల దివాకర్, శోభ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి

సిపిఎం మండల మహాసభలో జిల్లా నేత కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో సిపిఎం అచ్యుతాపురం మండల మహాసభ శనివారం జరిగింది. ముందుగా సిపిఎం జెండాను సీనియర్ నాయకులు బుద్ధ రంగారావు ఆవిష్కరించారు. అనంతరం కూండ్రపు సోమునాయుడు అధ్యక్షతన జరిగిన మహాసభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ నేడు దేశంలో అన్ని రకాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు కొత్త ఉద్యోగాలు రావడం లేదని, మరో వైపు పరిశ్రమలు మూతపడి ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు మోపుతుందన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని భావించి భూములు ఇవ్వగా, ఆ భూముల్లో వచ్చిన పరిశ్రమలు స్థానికులకు ఉపాధి కల్పించడం లేదని పేర్కొన్నారు. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఎక్కడ అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, రూ.11 వేల కోట్లు విద్యుత్ చార్జీల భారాలను ప్రజలపై వేసిందని తెలిపారు. ఉచిత ఇసుక ఎక్కడా అమలు కాలేదన్నారు. మహిళలపై విపరీతంగా దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరలేక నష్టపోతున్నారన్నారు. ఈ సమస్యలపై సిపిఎం ప్రజాపోరు యాత్రను చేపట్టిందని చెప్పారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఆర్.రాము కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల నాయకులు కర్రి అప్పారావు, రాంప్రసాద్, తాతీయులు, అర్.లక్ష్మి, కన్నంనాయుడు, సదాశివరావు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, వేదికపై అప్పలరాజు, రాము, శంకరరావు తదితరులు

సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్‌గా గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి



గంటా శ్రీరామ్

సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్‌గా గంటా శ్రీరామ్ మరోసారి ఎన్నికయ్యారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంతో శుక్రవారం జరిగిన సిపిఎం అనకాపల్లి మండల మహాసభలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సభ్యులుగా కాళ్ళ తేలయ్యబాబు, బోప్పే ఉమా మహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, కనకాల అప్పలరాజు (రాజు), జి.సుభాషిణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం గంటా శ్రీరామ్ విలేకర్లతో మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో ముఠా, పార్సెల్, మున్సిపల్, రవాణా, స్కీం వర్కర్లు, విద్య, వైద్యం, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపైనా, ల్యాండ్ పూలింగ్, భూ సమస్యలు, రహదారులు, మంచినీరు, పారిశుధ్యం, సాగునీరు సమస్యలపైనా పోరాటాలు చేస్తామని చెప్పారు.

సమిష్టి కృషి ద్వారానే మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి -తగరపువలస : సమిష్టి కృషి ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విశాఖ ఐఐఎం అకడమిక్స్ డీన్ ఎం.విజయభాస్కర్ చెప్పారు. స్థానిక ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'యూత్ ఫర్ ఎ సస్టెయిబుల్ ఫ్యూచర్" అంశంపై మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సు నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే సదస్సులో శనివారం పలు అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కర్ మాట్లాడుతూ, సుస్థిరతా లక్ష్యాల సాధనలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి మాట్లాడుతూ, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రోజు వారీ పరిణామాలు, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకునేందుకు ఈ సదస్సు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. యువ నాయకత్వం, విమర్శనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. పలు దేశాల నుంచి యువ డిబేటర్లు, డిప్లమాట్లు సదస్సుకు హాజరయ్యారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : పార్టీ కోసం పని చేసిన వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తగిన గుర్తింపు ఇస్తున్నారని టిడిపి అనకాపల్లి జిల్లా మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం చంద్రబాబు 59 కార్పొరేషన్ చైర్మన్‌లు ప్రకటించిన జాబితాలో అనేకమంది నాయకులు వైసిపి పాలనలో ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా అవమానాలు, అక్రమ కేసులు ఎదుర్కొని పార్టీకి సేవలు అందించిన వ్యక్తులు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనకాపల్లి పార్లమెంట్ కమిటీ తరఫున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.



ఎస్‌పి తుహిన్ సిన్హాతో సాయికృష్ణ

ఎస్‌పిని కలిసిన టిడిపి నేత సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక

మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ శనివారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజబాబు

రైలు, ప్లాట్‌ఫారం మధ్యలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి రైల్వే స్టేషన్లో శుక్రవారం రాత్రి జన్మభూమి రైలు ఎక్కడానికి ప్రయత్నిస్తూ రైలుకు, ప్లాట్‌ఫారానికి మధ్యలో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడిన పైలా రాజబాబు ప్రస్తుతం అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. హైదరాబాదు నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రాత్రి 7 గంటలకు అనకాపల్లి చేరుకోగా, అనకాపల్లి జిల్లా రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన పైలా రాజబాబు కదులుతున్న రైలును ఎక్కే ప్రయత్నం చేశారు. ఈ సమయంలోకాలుజారి ట్రైన్‌కి ప్లాట్‌ఫారానికి మధ్యలో ఇరుకున్నాడు. కదులుతున్న ట్రైన్ నుండి కిందకు పడిపోవడంతో రాజబాబు పెద్దపెద్ద కేకలు వేయగా, గమనించిన రైల్వే గార్డ్ ట్రైన్ ఆపాడు. దీంతో రైల్వే అధికారులు 40 నిమిషాల పాటు తీవ్రంగా శ్రమించి ప్లాట్‌ఫారం తవ్వి రాజబాబును కాపాడారు. తీవ్రంగా గాయపడిన రాజబాబును అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యులు కెజిహెచ్‌కు రిఫర్ చేయగా, ఆయన అనకాపల్లిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



తీవ్రంగా గాయపడిన రాజబాబు

గ్రామ సర్పంచ్ నుంచి ఎదిగిన ప్రగడ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టిడిపి యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు గ్రామ సర్పంచ్ స్థాయి నుండి ఎడిగారు. 35 సంవత్సరాల రాజకీయ చరిత్రలో మండలంలోని దుప్పుతూరు గ్రామ సర్పంచ్‌గా, పాల సంఘ అధ్యక్షులుగా, విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా, టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పదవులు నిర్వహించారు. నాగేశ్వరరావు కష్టపడి పనిచేసి చేపట్టిన పదవికి న్యాయం చేస్తారు. ఆరోగ్యం బాగోలేకపోయినా గత ఐదేళ్లగా టిడిపి అభివృద్ధికి అహర్నిశలు పనిచేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎలమంచిలి టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ కూటమిలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. అయినా పార్టీ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేశారు. నాగేశ్వరరావు చేసిన సేవలను అధిష్టానం గుర్తించి ప్రగడకు రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిలో నియమించడం పట్ల ఎలమంచిలి నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు నాయకులు అభినందనలు తెలుపుతున్నారు.



చంద్రబాబుతో ప్రగడ నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

ప్రగడకు పదవిపై తెలుగుతమ్ముళ్ల హర్షం

యలమంచిలి : టిడిపి యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావుకు ఏపి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంపై తెలుగుతమ్ముళ్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు యలమంచిలి టిడిపి కార్యాలయంలో మాజీ ఎంపీ చలపతిరావు సమక్షంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాన సూర్యనాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఆడారి ఆదిమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారి సాంబ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, నమ్మి రమణ, గొర్లి బాబురావు, నానేపల్లి సబ్బయ్యనాయుడు, సూరకాసుల రమణ, పిల్లా గంగాధర్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్ల సురేంద్ర ప్రస్థానమిదీ..

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్ర ప్రదేశ్ గవర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మళ్ల సురేంద్ర సాధారణ కార్యకర్త నుండి అంచలంచెలుగా ఎదిగారు. తెలుగు యువత నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఈ 28 ఏళ్ల కాలంలో పలు పదవులు చేపట్టారు. 2013లో టిడిపి కష్టకాలంలో ఉన్నప్పుడు చంద్రబాబు సురేంద్రను కోర్ కమిటీ సభ్యుడిగా నియమించారు. అనంతరం నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. టిడిపి అర్బన జిల్లా ఉపాధ్యక్షులుగా, జివిఎంసి 81వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జిగా, క్లస్టర్ కోఆర్డినేటర్‌గా, టిడిపి రాష్ట్ర గవర సాధికార సమితి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించి అనకాపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఎన్నికల్లో గజపతినగరం నియోజకవర్గానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. పార్టీ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్ గెలుపునకు కృషి చేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్‌గా మళ్ళ సురేంద్రను నియమించడం పట్ల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



చంద్రబాబుతో మళ్ల సురేంద్ర

రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పునర్నిర్మాణానికి టిడిపి కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎనలేని కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొద్ది కాలానికే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. ప్రధానంగా వైసిపి పాలకులు రోడ్లను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని, వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.860 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.103 కోట్లతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా ఆ పార్టీకి పుట్టగతులు ఉండవని నాగజగదీష్ హెచ్చరించారు.



బుద్ధ నాగజగదీశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో ఎస్ఎస్ఎస్.నారాయణ మృతి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, మండల కన్వీనర్ శ్రీరామ్ సంతాపం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గవరపాలేనికి చెందిన సిపిఎం పార్టీ సానుభూతిపరులు ఎస్.సూర్యసత్యనారాయణ(61) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి మృతి చెందారు. త్రిబుల్ ఎస్ నారాయణగా పేరుబడ్డ ఆయన ప్రారంభం నుంచి సిపిఎం సానుభూతిపరులుగా ఉన్నారు. యువజన సంఘం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన కృషితో గవరపాలెం ప్రాంతంలో సిపిఎం బలోపేతమైంది. త్రిబుల్ ఎస్ నారాయణ ప్రోత్సాహంతో ఆయన భార్య శారద సిపిఎం తరుపున అనకాపల్లి మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఆయన గత 30 ఏళ్లగా విశాఖ ఫైనాన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. కాగా సత్యనారాయణ దేవరాపల్లిలో తనకున్న వ్యవసాయ భూమిలో మూడు రోజుల పాటు వరి పంట కోయించారు. చివర రోజు శుక్రవారం ఆయన కుమారుడు వెంకటేష్‌తో కలిసి దేవరాపల్లి నుంచి అనకాపల్లి వైపు వస్తుండగా జమ్మాదేవిపేట వద్ద పల్సర్ బైక్ ఢీకొనడంతో త్రిబుల్ ఎస్ నారాయణ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఆయన కుమారుడు వెంకటేష్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తూ ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం నిర్వహిస్తున్నారు. పెద్ద కుమార్తె స్వాతి అమెరికాలోనూ, చిన్న కుమార్తె సంధ్య విజయవాడలో ఉంటున్నారు. నారాయణ మృతి విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున వారి గృహానికి చేరుకొని నివాళులర్పించారు.

ఎస్ఎస్ఎస్ నారాయణ మృతికి సిపిఎం సంతాపం

అనకాపల్లి మున్సిపాల్టీ సిపిఎం మాజీ కౌన్సిలర్ కాంగ్రెగుల శారదా భర్త ఎస్ఎస్-ఎస్ నారాయణ అకాల మరణానికి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. నారాయణ భార్య శారదా సిపిఎం కౌన్సిలర్‌గా పనిచేసినప్పుడు ఆమెను ఎంతో ప్రోత్సహించేవారని, ప్రజా సమస్యలపై జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేవారని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు సిపిఎం సానుభూతిపరులుగా ఉంటూ వివిధ సమస్యలపై నిర్వహించే సెమినార్లు, సదస్సులకు తన వంతు కృషి చేసేవారని తెలిపారు.


ఎస్ఎస్ఎస్.నారాయణ (ఫైల్‌ఫోటో)


మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

న్యాయ విజ్ఞానంపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-అనకాపల్లి

న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య సూచించారు. ప్రత్యేకంగా పెరుగుతున్న టెక్నాలజీకి సంబంధించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. లీగల్ లిటరసీ డే సందర్భంగా శనివారం న్యాయవాదులతో న్యాయ శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలకు గురైతే ఎలా ఎదుర్కోవాలో వెల్లడించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన ఉంటే మోసాల నుంచి బయటపడ వచ్చని సూచించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్, అధ్యక్షులు ఎంజేవిఎన్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


యర్రవరం నీటి నిల్వ ట్యాంకును క్లీనింగ్ చేస్తున్న సిబ్బంది

తాగునీటి ట్యాంకు క్లీనింగ్

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీకి నీటి సరఫరాకు సంబంధించి ముఖ్య కేంద్రమైన యర్రవరం సంపు క్లీనింగ్, శానిటేషన్ పనులు శనివారం చేపట్టారు. రోజూ 3 లక్షల లీటర్లు సరఫరా చేసే ట్యాంక్ క్లీనింగ్ అరుదుగా జరుగుతూ ఉంటుంది. అయితే మంచినీరు సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోవడంతో వాటి మరమ్మతు పనులు చేస్తున్న నేపథ్యంలోనే సంపు క్లీనింగ్ పనులు కూడా చేపట్టారు. భూగర్భ సంప్ క్లీనింగ్ చేయడం కాస్త సాహసంగానే చెప్పుకుంటారు. విషవాయువులేమైనా వ్యాపిస్తే అక్కడ పనిచేసే కార్మికులకు ప్రాణ ప్రమాదం కూడా ఉంటుంది. అక్కడ పేరుకున్న షిల్టు పదార్థాలను మోటార్లతో తోడి బైటకు పంపించారు. శనివారం సాయంత్రానికి పైప్‌లైన్ రిపేరు పనులు పూర్తయి ఆదివారం మంచినీటి సరఫరాకు సిద్ధమౌతున్నట్లు మున్సిపల్ ఏఇ సుబ్బారావు తెలిపారు.

రూ.6 కోట్లతో గ్రోయిన్లు, పంట కాలువల మరమ్మతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో ఆరు కోట్ల రూపాయలతో గ్రోయిన్లు, పంట కాలువల మరమ్మతులు చేపట్టనున్నట్లు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్ జనసేన పార్టీ కార్యాలయంలో అనకాపల్లి-కశింకోట మండలాల కూటమి శ్రేణులతో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసారని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు చదరం నాగేశ్వరరావు, కర్రి బాబీ, కాయల మురళీ, పీలా తాతునాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టు తగదు

జిల్లా ఎంఎస్‌పి వైసిపి నేతలు వినతి


ఎస్‌పి కార్యాలయం వద్ద బూడి ముత్యాలనాయుడు, వైసిపి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్రంలో వైసిపి సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు చేయడం తగదని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోదరుడు కుమార్ రాజా, ఇతర నాయకులతో కలిసి శనివారం బూడి ముత్యాలనాయుడు జిల్లా అడిషనల్ ఎస్‌పి దేవా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగానే వైసిపి కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. చట్టం అందరికీ సమానమే అయితే, వైయస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఆయన కుటుంబాన్ని ఉద్దేశించి టిడిపి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా నిరంతరంగా దుర్భాషలాడుతూ, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచారం చేస్తుందని, వైసిపి నాయకులపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలపై కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, వైసిపి పట్టణ, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, పెద్దిశెట్టి గోవిందు, మలసాల కిషోర్, నాయకులు బొడ్డేడ శివ, జాజుల రమేష్, పెంటకోట శ్రీనివాస్, కెఎం నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయితీ బురదపేట గ్రామంలో శ్రీముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బురద ముత్యాలు, బురద తాతబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేస్తాని, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు వచ్చి కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎంపిటిసిలకు అందని గౌరవ వేతనం

18 నెలలుగా ఎదురుచూపులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా గౌరవ వేతనాలు నెలనెలా అందని పరిస్థితి నెలకొంది. మండలంలోని ఎంపిటిసి సభ్యులకు 18 నెలలుగా గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో ఎదురుచూస్తున్నారు. మండలంలో మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది-1, వడ్డాది-2, వడ్డాది-3, లోపూడి, పొట్టిదొరపాలెం, పి.భీమవరం, బుచ్చయ్యపేట-1, బుచ్చయ్యపేట-2, దిబ్బిడి, కందిపూడి, పెద్దమదిన, చింతపక, గున్నెంపూడి, పెదపూడి, చిట్టయ్యపాలెం, రాజాం, మల్లం సెగ్మెంట్లలో ఎంపిటిసి సభ్యులు ఉన్నారు. ప్రజా ప్రతినిధులుగా గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం, సమస్యల పరిష్కారం కోసం రాకపోకలు తదితర అవసరాల నిమిత్తం ఒక్కొక్క ఎంపిటిసి సభ్యునికి నెలకు రూ.10వేలు నుండి రూ.15వేలు వరకు ఖర్చవుతుంది. అయితే ప్రభుత్వం గౌరవ వేతనంగా ఎంపీపీకి రూ.6000, ఎంపీటీసీ సభ్యులకు రూ.3000 చెల్లిస్తుంది. ఈ కొద్దిపాటి గౌరవ వేతనం కూడా గత 18 నెలలుగా ఎంపిటిసి సభ్యులకు ప్రభుత్వాలు విడుదల చేయలేదు. దీంతో పలువురు ఎంపీటీసీలు గౌరవ వేతనాలు విడుదల చేయలేదని కోరుతున్నారు. ఎంపీటీసీ గౌరవ వేతనాలపై మండల పరిషత్ ఏవో శ్రీనివాసరావును వివరణ కోరగా గౌరవ వేతనాలకు సంబంధించి బడ్జెట్ వివరాలు జిల్లా అధికారులకు పంపించామని, విడుదలైన వెంటనే సభ్యుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.

కొత్త ప్రభుత్వమైనా విడుదల చేయాలి

18 నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలి.

- దేవర అప్పారావు, మండల ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు



ఆరోగ్యశ్రీ రోగులకు ఆసరా డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఆగస్టు నెల నుండి ఆసరా డబ్బులను వెంటనే చెల్లించాలని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించుకుని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుని కోలుకోవలసిన రోగులకు ప్రభుత్వం ఆసరా డబ్బులు చెల్లించకపోవడంతో ఇంట్లో సంపాదించే మనిషి మంచాన పడి ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆగస్టు నుండి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసుకున్న రోగులకు చెల్లించాల్సిన ఆసరా డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

'సాహితీ ప్రవీణ' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ దొడ్డి ప్రవీణ రాసిన "సాహితీ ప్రవీణ" గ్రంథాన్ని శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాహితీ ప్రవీణ గ్రంథంలోని వ్యాసాలు సమాజానికి మనోవికాసం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి మాట్లాడుతూ, గ్రంథంలో ఉండే వ్యాసాలు ప్రాచీనం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక కోణాల్లో ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సహదేవుడు, వై.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, డి.మాధురి, వై.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత్రి డాక్టర్ ప్రవీణను అభినందించారు.

ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో కాంద్యూర సంస్థ ఆధ్వర్యాన బి.టెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య, మెరుగైన ఉద్యోగ అవకాశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంద్యూర సంస్థ సీఈఓ మొహమ్మద్ అబ్దుల్లా ప్రసంగిస్తూ ఉన్నత విద్య అభ్యసించడం వల్ల నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని పెంచుకోవచ్చని, తద్వారా మెరుగైన అవకాశాలు సంపాదించుకోవచ్చని తెలిపారు. ఆలోచనాపరంగా ఇంగ్లీష్‌ను ప్రథమ భాషగా మలుచుకోవడం వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం పెంచుకోవచ్చని సూచించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్‌లో ఉండగానే విద్యార్థులు తమ భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, ట్రైనింగ్ అండ్ కెరీర్ గైడెన్స్ విభాగ సిబ్బంది, వివిధ విభాగాధిపతులు, కాంద్యూర సంస్థ సీఈఓ మొహమ్మద్ అబ్దుల్లాను సత్కరించారు.


మొహమ్మద్ అబ్దుల్లాను సత్కరిస్తున్న డైట్ అధికారులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి- కోటవురట్ల:సాగునీటి సంఘాల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది ఇందులో భాగంగా శనివారం సాగునీటి ఎన్నికల వోటర్ లిస్టు గ్రామాల్లో విడుదల చేశారు. మండలంలో ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల కానుంది. 13న ఫైనల్ పబ్లికేషన్, అనంతరం 23న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలియజేశాయి.

మండల వ్యాప్తంగా ఆరు మైనర్ చానెల్స్, దుర్గాడ ఛానల్ కు సంబంధించి ఆరు గ్రామాలు, తాండవ ఛానల్ కు సంబంధించి 13 చానల్లో మూడు గ్రామాలకు, 14 చానల్లో ఐదు గ్రామాలకు, 15 ఛానల్లో ఆరు గ్రామాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. పోలింగ్ కు సంబంధించి మైనర్ చానల్స్ 42 పోలింగ్ కేంద్రాలు, మేజర్ ఛానల్ కు 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేజర్ చానల్ 2833 రైతులు ఉండగా, ఆయకట్టు 1792.79, ఎకరాలు, మైనర్ ఛానల్ 3699 మంది రైతులు ఉండగా, 3070.50 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే జల వనరుల శాఖ, తహసిల్దారు, ఎంపీడీవో సహా సంబంధిత అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు దాదాపు తొమ్మిది సంవత్సరాల తర్వాత ఆయకట్టుకు ఎన్నికలు రావడంతో గ్రామీణ ప్రాంతాలలో మంచి రోజులు రానున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 23న రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.



ఓటర్ లిస్ట్ విడుదల చేస్తున్న తహశీల్దార్

డిజిటల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయరూ..

ప్రజాశక్తి -రావికమతం:గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ లేక పోవడంతో పౌర సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలో 22 గ్రామ వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీల్లో ఉద్యోగులు వేరువేరు చోటకు బదిలీ అయ్యారు. ఈ బదిలీల్లో మేడివాడ, చినపాచిల, కొమెర సచివాలయాలకు సంబంధించిన డిజిటల్ అసిస్టెంట్స్ బదిలీ అయ్యారు. దీంతో ఈ స్థానాలు ఖాళీ ఏర్పడ్డాయి. ఈ మూడు స్థానాల్లో కొత్తవారిని నియమించక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమెర సచివాల పరిధిలో కొమిర, కే.బి.పీ అగ్రహారం, ఎర్రబంద, బుడ్డిబంద, కవగుంట గ్రామాలు ఉండగా చినపాచిల సచివాలయ పరిధిలో చినపాచీల, గుమ్మాలపాడు పంచాయతీలు ఉన్నాయి. మేడివాడ మేజర్ పంచాయతీలో మేడివాడతో పాటు అప్పలమ్మపాలెం, బాదనపాడు తదితర గ్రామాలు ఉన్నాయి. డిజిటల్ అసిస్టెంట్స్ లేకపోవడంతో కుల, ఆదాయం సర్టిఫికెట్లు, పించన్ల, భూమి ఆన్లైన్, ముటేషన్లు, వన్ బి, అడంగల్ తదితర వాటికి దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

శ్రీ ప్రకాష్‌లో ముగిసిన రిమ్ - జిమ్ వేడుకలు



రిమ్ జిమ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న రిమ్ జిమ్ - 2024 ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల తుని, పాయకరావుపేట, అన్నవరం విద్యార్థులు సుమారు 4500 మందికి సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాలపై జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 29 రకాల పోటీలను గత ఐదు రోజులుగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీ ఫైస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హెూల్ టైం డైరెక్టర్ ఎమ్.వి.రామకృష్ణ , డెక్కన్ ఫైన్ కెమికల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.బంగారు బాబు, 6వ ఆంధ్రా నావెల్ ఎన్.సి.సి కమాండింగ్ ఆఫీసర్ సి.డి.ఆర్. అక్షయ్ అరుణ్ హాజరయ్యారు.వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్.వి.రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొనే వెసులుబాటు తల్లిదండ్రులు కల్పించాలన్నారు. ఆర్.బంగారు బాబు మాట్లాడుతూ, సమాజం, పర్యావరణంపై పలు విషయాలు నేర్చుకోవాలన్నారు. అక్షయ్ అరుణ్ మాట్లాడుతూ, పరిపూర్ణమైన ఆరోగ్యం ఆటల ద్వారానే సాధ్యమవుతుందన్నారు.విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలోనూ ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. అనంతరం అతిధులకు జ్ఞాపికలు బహుకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, రిమ్ జిమ్ కన్వీనర్ మౌళి, అకడమిక్ ఇంచార్జిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున అసోసియేషన్ సభ్యులు

అటవీ అధికారుల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు స్థానిక అల్లూరి సీతారామరాజు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ఎం. సింహాచలం, వైస్ ప్రెసిడెంట్ గా కె.లక్ష్మణ్ కిరణ్, జనరల్ సెక్రటరీగా ఆర్. లక్ష్మణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్. సన్యాసి రావు, జాయింట్ సెక్రటరీ గా కె. సంధ్యా రాణి ట్రెజరర్ గా డి.గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్కిల్ రిప్రజెంటేటివ్ ఆర్. వినోద్ కుమార్ జోనల్ సెక్రటరీ కె. శివ ప్రసాద్ అధ్యక్షతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రయివేటు పాఠశాలల

యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :పట్టణంలో శనివారం ప్రభుత్వ సెలవు అయినప్పటికీ పాఠశాలలను తెరిచిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ జనార్ధన్ మాట్లాడుతూ, పాఠశాలల యాజమాన్యాలను నిలదీసినప్పటికీ పొంతనలేని సమాధానాలు చెపుతున్నారన్నారు. విద్యార్థులను ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు.ప్రైవేట్ పాఠశాలల పై విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారన్నారు. గతంలో ఇలాగే గాంధీ జయంతి రోజు కూడా ప్రైవేట్ పాఠశాలలు తెరిచారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ జనార్ధన్, భూషణ్, డివైఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్ , ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు జై కృష్ణ , ధర్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని గుండుపాల గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై సర్పంచ్ చిన్నబ్బాయి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 5రకాల ఆకులతో బ్రహ్మాస్త్రం కషాయంను తయారు చేశారు. ఈ కషాయం వరిలో పచ్చపురుగుకి, కూరగాయలలో పెద్ద పురుగులకి, అలాగే కాయతొలుచు పురుగు నివారణకు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ వరలక్ష్మి, ఏసిఆర్‌పిఎస్ గంగ, పార్వతి, సత్యవేణి, శాంతకుమారి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రెయినర్



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపిటిసి

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఎంపీటీసీ సభ్యులు కుంచే మధు పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 100 రోజుల పని దినాలు పూర్తయిన తర్వాత, పనుల్లోకి రానివ్వడం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 100 రోజుల తర్వాత కూడా పనులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కమ్మిళ శివరామకృష్ణన్ రాజు, ఉపాధ్యక్షులు పల్లా రాంబాబు, పిట్టా నాగేశ్వరరావు, సింహాద్రి పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌ను శిక్షించాలి

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ఇటీవల వైసిపి నాయకుడు కర్రి శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేసిన రౌడీ షీటర్ అప్పలనాయుడుపై కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ డిమాండ్ చేశారు శనివారం మీడియాకు రౌడీషీటర్ ఫోటోలు చూపిస్తూ మాట్లాడారు. రౌడీషీటర్‌పై కేసు పెట్టి వదిలేయడం ఏమిటని ప్రశ్నించారు. రౌడీషీటర్‌పై కేసు పెట్టి పోలీసులు చేతులు దులుపు కున్నారన్నారు. ఈ రౌడీషీటర్ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కు ముఖ్య అనుచరుడన్నారు. వైసీపీ నాయకులను భయబ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ఇటీవల కోట్లాది రూపాయల ఇసుక దోపిడి జరుగుతుంటే తమ పార్టీ నాయకులు పట్టుకున్నారని, అటువంటిది దొంగలను విడిచిపెట్టి అక్రమ కేసులు పెట్టారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒత్తిడి మేరకు పోలీసులు తమపై తప్పుడు కేసులు పెడుతున్నారా అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తుందని తప్పుడు కేసులను బయటకు తీసి చట్ట పరంగా, న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు.



రౌడీ షీటర్ పాటొను చూపుతున్న గణేష్



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్డుపై మురుగు నీరు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని గుండుబాడు గ్రామంలో డ్రైనేజీ లేక రోడ్డుపైనే మురుగు నీరు నిల్వ ఉంటుందని గ్రామస్థులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు కావస్తున్నా గుండుబాడు పంచాయతీలో డ్రైనేజీ సమస్య పరిష్కారం చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీ సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-అరకులోయ :పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం పర్యాటకులు తరలి వచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడి సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఓటు హక్కు నమోదు శిబిరాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో శనివారం ఓటు హక్కు నమోదుపై ప్రత్యేక కార్యక్రమం మండల వ్యాప్తంగా నిర్వహించారు, యండపల్లిలో నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని తహసిల్దారు తిరుమల బాబు పర్యవేక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.



పరిశీలిస్తున్న తహశీల్దార్



మాట్లాడుతున్న ప్రకాశరావు

విద్యా వ్యవస్థ పటిష్టతకు ఆజాద్ ఎనలేని కృషి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు శనివారం డాబాగార్డెన్స్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో బాల వికాస ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు.తొలుత సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు, కాలేజీ ప్రిన్సిపాల్ కడారి కుమార్ అజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ, అజాద్ జయంతి ని జాతీయ విద్యా దినంగా జరుపుకుంటామన్నారు. ఆయన ఆశయాలు విద్యార్థులకు స్ఫూర్తి కావాలని సూచించారు. దేశ విద్యావ్యవస్థ ను పటిష్ట పరిచేందుకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్థాపించి విద్యావ్యాప్తి కి కృషి చేశారని,గ్రామీణ ప్రాంతాల్లో బాలలలకు ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టారని తెలిపారు. హిందూ ముస్లిం ఐక్యతకు కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ కడారి కుమార్, ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ కె.రామకృష్ణా రెడ్డి, ఎస్.వి.ఆర్.నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్

బస్సులను పరిశుభ్రంగా ఉంచాలి

-ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:బస్సులు అన్నింటిని కండిషన్లో ఉంచి, పరిశుభ్రమైన బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఆదేశించారు. శనివారం ఆయన వాల్తేరు డిపో తనిఖీ చేసి, గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడారు. స్టూడెంట్స్ రద్దీ ని దృష్టిలో ఉంచుకుని 300 ఎస్ సర్వీస్‌ను ప్రారంభించారు.పంచారామాలు యాత్ర కు మంచి స్పందన వచ్చిందని, ఈ వారంలో ఆరు బస్సులు ప్రయాణ మవుతున్నాయన్నారు. ఈ పంచారామ దర్శిని ప్రయాణానికి సూపర్ లగ్జరీకి రూ.2150, అల్ట్రా డీలక్స్ రూ.2100 ధర నిర్ణయించామన్నారు.శబరిమల యాత్ర కు కొత్త బస్సులు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, వారితో మర్యాద పూర్వకంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, డిపో సూపర్ వైజర్స్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:కోల్ కతా ఆర్ జి కార్ ఆసుపత్రిలో అత్యాచారానికి, హత్యకు గురైన అభయ కుటుంబానికి న్యాయం చేయాలని, ఈ సంఘటనపై నియమించిన సిబిఐ విచారణను సత్వరం పూర్తిచేయాలని, దోషులందరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ లారీ స్టాండ్ జ్ఞానాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద పిఓడబ్ల్యు, ఐఎఫ్ టియు సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యు విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్ టియు నాయకులు వై. కొండయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ, 90 రోజులైనా ఛార్జ్ షీట్ ఫైల్ చేయడానికి సిబిఐ విచారణను పూర్తి చేయని వైఖరిని మార్చడానికి, సుప్రీం కోర్టు కాలపరిమితిని విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ ఉపాధ్యక్షురాలు కె. బాలనాగమ్మ, ప్రధాన కార్యదర్శి రోహిణి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం నేతల పిలుపు - పలుచోట్ల ప్రజాపోరు



అచ్యుతాపురం మండలం హరిపాలెంలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాత్సారం చేస్తుందన్నారు. విద్యుత్తు ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారం చేపట్టిన 100 రోజులలోనే ట్రూ అప్ ఛార్జీలు పేరుతో ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ఎస్ఇజెడ్‌లోని అభిజిత్ పరిశ్రమ మూతపడి 1000 మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం సాగిస్తుందని, ప్రజలు మద్దతు పలికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు కాండ్రేగుల రామ సదాశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకరరావు, మండల నాయకులు ఆర్.రాము, కర్రి అప్పారావు, కె సోమునాయుడు, బి సూర్యరామ్‌కుమార్, బుద్ధ రంగారావు, ఎస్ కనుమనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో..

కె.కోటపాడు : ప్రజా సమస్యలపై ఈ నెల 8 నుండి 14వ తేదీ వరకు సిపిఎం తలపెట్టిన ప్రజాపోరు కార్యక్రమం వాల్ పోస్టర్లను మండలంలోని సూరెడ్డి పాలెం గ్రామంలో శనివారం సిపిఎం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనబాబు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వనము సూర్యనారాయణ, బొడ్డు ఆదినారాయణ, జాజిమొగ్గల సముద్రం, బొడ్డు అర్జున, బొడ్డు అచ్చిబాబు, సూరెడ్డి అచ్చెమనాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : సిపిఎం ప్రజాపోరు కార్యక్రమం వాల్ పోస్టర్లను మండలంలోని వంగలి గ్రామంలో శనివారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, మహిళలు, పిల్లలు, దళితులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎర్ర సోంబాబు, పి కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ప్రజా పోరు పోస్టర్‌ను స్ప్రింగ్ రోడ్ జంక్షన్‌లో ఆవిష్కరించారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, నాయకులు కె.శేఖర్ మాట్లాడారు. ముఠా కార్మికులు పాల్గొన్నారు.



తగరపువలసలో...

మధురవాడ : సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 5వ వార్డు పరిధి పరదేశిపాలెం, కొత్త పరదేశిపాలెంలో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను అన్నిరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతున్న ప్రభుత్వాలు, ప్రజల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామని ఎన్నికల ముందు వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం అటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. భారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ప్రజాపోరులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, డి.కొండమ్మ, బి.భారతి, ఎ.గురుమూర్తి రెడ్డి, కె.సుజాత, లీల, డి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెందుర్తి : నిత్యావసర ధరలు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యాన జివిఎంసి 97వ వార్డు పరిధి వీరనగర్, 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో నిరసన తెలిపారు. చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యవసర ధరలను, విద్యుత్ భారాలను తగ్గించాలని డిమాండ్‌చేశారు. 94వ వార్డు పరిధి చైతన్యనగర్‌లో జోన్ కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, 97వ వార్డు పరిధి వీరనగర్‌లో జోన్ కార్యదర్శి జగన్, 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో జోన్ కమిటీ సభ్యులు శంకరరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.అప్పలనాయుడు, ఆనంద్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

తగరపువలస : సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి ఒకటో వార్డు పరిధి కొత్తపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వి.నాగరాజు, రీసు నరసింగరావు, కర్రి రాము, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో...

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు హెూరాహెూరీ గా జరుగుతున్నాయి. శనివారం రెండవ రోజు స్థానిక హాకీ క్రీడా మైదానంలో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో పోటీలో పాల్గొన్నారు. బాలికల విభాగంలో 12 జట్లు పోటీలో పాల్గొన్నాయి. నెల్లూరు -శ్రీకాకుళం జట్లు తలపడగా 0-1 శ్రీకాకుళం విజయం సాధించింది. కృష్ణ -ఈస్ట్ గోదావరి మ్యాచ్ టై గా ముగిసింది.

ప్రకాశంపై విశాఖపట్నం 0-3తోనూ, వైస్సార్ కడప -వెస్ట్ గోదావరిపై విజయం సాధించాయి. కర్నూల్ -విజయనగరంపై, కృష్ణ -శ్రీకాకుళంపై తూర్పు గోదావరి -నెల్లూరుపై విజయం సాధించాయి.

చిత్తూరుపై 1-0తో విశాఖపట్నం, వైస్సార్ కడప -గుంటూరుపై గెలుపొందాయి. క్వార్టర్స్ కు చేరి సెమిస్ కు తలపడ్డాయి. వైస్సార్ కడప విజయనగరంపై,

కృష్ణపై చిత్తూరు, విశాఖపట్నం -ఈస్ట్ గోదావరిపై, కర్నూల్ గుంటూరుపై విజయంతో సెమిస్ కు చేరుకున్నాయి..

బాలురు విభాగం లో 14 జట్లు పోటీల్లో తలపడ్డాయి.

ప్రకాశం -కర్నూల్‌పై, విశాఖపట్నం- అనంతపురంపై చిత్తూరు -శ్రీకాకుళంపై విజయం సాధించాయి.



హోరా హోరీగా సాగుతున్న పోటీలు

వైఎస్ఆర్ కడప కృష్ణపైనా, విజయనగరంపై కర్నూలు, ప్రకాశంపై ఈస్ట్ గోదావరి గెలుపొందాయి. వెస్ట్ గోదావరిపై విశాఖపట్నం, చిత్తూరు -గుంటూరుపై

వైఎస్ఆర్ కడప ఎస్.పి ఎస్.ఆర్ నెల్లూరుపై గెలుపొందాయి. క్వాటర్స్‌తో సత్తా చాటి సెమీస్‌కు చేరాయి. వైఎస్ఆర్ కడప అనంతపురంపైనా ఈస్ట్ గోదావరి- గుంటూరుపైనా, ప్రకాశంపై చిత్తూరు విజయం తో సెమీస్‌కు చేరినట్లు నిర్వాహకులు వెల్లడించారు.